సాక్షి నిజామాబాద్

బుధవారం ׀ 29 ׀ జనవరి ׀ 2025



అధికారంలో లేకున్నా..

బీఆర్‌ఎస్ అధికారంలో లేకున్నా అభివృద్ధి పనులకు నిధులు సమకూరుస్తున్నానని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸



తాగునీటి కోసం ఆందోళన

తాగునీటి సమస్యను పరిష్కరించాలని రాయకూర్ గ్రామస్తులు కార్యదర్శిని నిర్బంధించి జీపీకి తాళం వేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.1 /14.6

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొన సాగుతుంది.

న్యూస్‌రీల్

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఆరుగురికి జైలు



ఖలీల్‌వాడి : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ఆరుగురు వాహనదారులకు న్యాయస్థానం జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఆదేశాల మేరకు నిజామాబాద్ డివిజన్ పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 22 మంది పట్టుబడ్డారని పేర్కొన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్‌లలో కౌన్సెలింగ్ నిర్వహించి మంగళవారం స్పెషల్ జ్యుడిషియల్ రెండో క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా ఇద్దరికి ఒక రోజు చొప్పున, ముగ్గురికి రెండు రోజులు, మరొకరికి మూడురోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారని తెలిపారు.

29 వాహనాలు సీజ్

మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరంలోని ఒకటో, మూడో, నాలుగో, ఐదో టౌన్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో వాహనాలు తనిఖీ చేసినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. సరైన పత్రాలు, నంబర్‌ప్లేట్లు లేని 29 వాహనాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని ఆయన సూచించారు.

అపార్ నమోదు చేయించుకోవాలి




నిజామాబాద్‌అర్బన్: ప్రాథమిక స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు ప్రతి విద్యార్థి తప్పనిసరిగా అపార్ నమోదు చేయించుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ అన్నారు. అపార్ నమోదు ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మంగళవారం మధ్యాహ్నం సమావేశం నిర్వహించారు.

రవికుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాల స్థాయిలో హెడ్ మాస్టర్‌లు, ప్రిన్సిపాల్‌లు వెంటనే విద్యార్థుల వివరాలతో యుడైస్ ద్వారా వన్ నేషన్ వన్ స్టూడెంట్ 12 డిజిట్ గుర్తింపు నంబర్ తీసుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థికి తన కెరీర్ అభివృద్ధి, ఉద్యోగం పొందేందుకు అపార్ అవసరమని అన్నారు. డీఈవో అశోక్, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జీవన్, జిల్లా ప్రభుత్వ కళాశాలల సీనియర్ ప్రిన్సిపాల్ రజీయొద్దీన్ అస్లాం, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

బైక్ వెంట పడిన చిరుత



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలం తాడెం ఎస్బీఐలో క్యాషియర్‌గా పని చేస్తున్న మదూత్ విధులు ముగించుకొని బైక్‌పై జిల్లా కేంద్రానికి వస్తుండగా చిరుత వెంటపడింది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు జానకంపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఎదురుగా లారీ, ఓ బైక్ రావడంతో చిరుత పక్కనే ఉన్న గుట్టల్లోకి వెళ్లిపోయింది. ఈ ఘటనపై అటవీ అధికారి ప్రతాప్‌ను సంప్రదించగా చిరుత వెంటపడింది వాస్తవమేనని అన్నారు. సమాచారం అందిన వెంటనే ఓ బృందాన్ని పంపించామన్నారు. చీకటి పడిన నేపథ్యంలో బుధవారం చిరుత తిరిగిన ఆనవాళ్లను సేకరిస్తామని తెలిపారు.



పడమటి సంధ్యారాగం

వెలుగు రేఖలను ప్రసరించి సమస్త మానవాళికి మేలు చేసే ఆదిత్యుడు సాయం సంధ్య వేళ అస్తమిస్తూ ఇలా అరుణవర్ణాన్ని వ్యాపింపజేశాడు. ఈ దృశ్యం వేల్పూర్ మండల కేంద్రం శివారులో మంగళవారం ఆవిష్కృతమైంది. సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో గుట్టలు, వృక్షాలు ఎరుపు, నలుపు వర్ణాల మధ్య ఇలా ఆకర్షణీయంగా కనిపించాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ప్రతిష్టాత్మక సంస్థకు బీ గ్రేడేనా?

దశాబ్దాలుగా విద్యారంగంలో ఎనలేని సేవలందిస్తున్న గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఇందూరు ఉమ్మడి జిల్లాకు తలమానికంగా నిలిచింది. ఇందులో చదువుకున్న విద్యార్థుల్లో ఐఏఎస్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థాయికి ఎదిగిన వారు ఉన్నారు. కళాశాలలో ప్రస్తుతం ఆర్ట్స్, సైన్స్‌లలో 47 డిగ్రీ కోర్సులు, 9 పీజీ కోర్సులు ఉన్నాయి. 4,500 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ నిధులు రాకపోయినా కళాశాల నిధుల నుంచి కొత్తగా 26 గదులు నిర్మించారు. కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. సకల సౌకర్యాలు ఉన్న ఈ కళాశాలకు న్యాక్ బీ గ్రేడ్ మాత్రమే ఇవ్వడంపై విమర్శలు వస్తున్నాయి. 'న్యాక్ ఏ ప్లస్' గ్రేడ్ ఇవ్వాలని విద్యాభిమానులు డిమాండ్ చేస్తున్నారు.

- 1956 నుంచి విద్యాసేవలందిస్తున్న గిరిరాజ్ కళాశాల
- 27 ఎకరాల విస్తీర్ణంలో కళాశాల
- 9 పీజీ, 47 యూజీ కోర్సులు.. 4,500 మందికి పైగా విద్యార్థులు
- 90 శాతం పైగా ఉత్తీర్ణత.. విద్యార్థుల్లో 60 శాతం పైగా బాలికలే..
- 'న్యాక్ ఏ' గేడ్ కోసం కృషి చేస్తున్న అధ్యాపక బృందం



గిరిరాజ్ కళాశాల

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందూరు జిల్లాను సమున్నత స్థానంలో నిలిపిన అంశాలను పరిశీలిస్తే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల పోషించిన పాత్రను కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సిందే. ఇంతటి ప్రతిష్టాత్మకమైన ఈ కళాశాల గత 69 సంవత్సరాలుగా జిల్లా ఘనతను అన్నిదిక్కులకు వ్యాపింపజేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. మొదట మూడు డిగ్రీ కోర్సులతో ప్రారంభమైన ఈ కళాశాలలో ప్రస్తుతం ఆర్ట్స్, సైన్స్‌లలో 47 డిగ్రీ కోర్సులు, 9 పీజీ కోర్సులు ఉన్నాయి. రాష్ట్రంలో కాకతీయ యూనివర్సిటీ తరువాత బీఎల్‌ఐఎస్‌సీ కోర్సు కలిగిన ఏకైక ప్రభుత్వ కళాశాలగా గుర్తింపు పొందింది. త్వరలో ఎంఎల్‌ఐఎస్‌సీ కోర్సు తీసుకురానున్నారు. 111 మంది టీచింగ్, 34 మంది నాన్ టీచింగ్, అవుట్‌సోర్సింగ్ 12 మంది, పార్ట్‌టైం 15 మంది ఉద్యోగులు ఉన్న గిరిరాజ్ కళాశాలలో 4,500 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల్లో 60 శాతం పైగా బాలికలే ఉండడం గమనార్హం. అయితే ప్రభుత్వం నుంచి నిధులు ఏమాత్రం రాకపోవడంతో ఇక్కడ మూడు కోర్సులు మినహా అన్నీ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులే నిర్వహిస్తున్నారు. చివరకు పాత భవనాల్లోని తరగతి గదుల జీవితకాలం పూర్తి కావడంతో కళాశాల నిధుల (ఆర్‌టీఎఫ్ ఫీజులు) ద్వారానే 2022లో 26 గదులు కొత్తగా నిర్మాణం చేశారు. 100 కంప్యూటర్లు, 16 డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం మూడు ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు.

డిగ్రీ భవనాల్లో 31 చోట్ల, పీజీ భవనాల్లో 16 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇక 2016లో 'రూసా' నిధులతో మరో ఐదు గదులు నిర్మించారు. 90 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్న ఈ ప్రభుత్వ కళాశాల అడ్మిషన్ల సాధన విషయంలో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలుస్తోంది. 2004 నుంచి అటానమస్ కళాశాలగా ఉంది.

■ గిరిరాజ్ కళాశాలలో ప్రస్తుతం 106 మందితో ఎన్‌సీసీ యూనిట్ నడుస్తోంది. 600 మంది విద్యార్థులతో ఆరు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు నడుస్తున్నాయి. ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల కారణంగా ప్రతిఏటా ఈ కళాశాల నుంచి కానిస్టేబుళ్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎంపికవుతున్నారు.



కొత్త భవనం

పూర్వ విద్యార్థుల సహకారంతో..

గిరిరాజ్ కళాశాలలో చదువుకున్నవారిలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్‌లు ఉన్నారు. వ్యాపార రంగంలో రాణిస్తున్నవారు చాలామంది ఉన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోగా, ఇందులో కొందరి సహకారంతో సౌకర్యాలు కల్పిస్తూ వస్తున్నారు. పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రతి ఏటా కళాశాల నుంచి 18 మంది మెరిట్ విద్యార్థులకు బంగారు పతకాలు ఇస్తున్నారు. 1975–79 బ్యాచ్ విద్యార్థుల సహకారం కొంత ఎక్కువగా ఉంటోంది. ఈ బ్యాచ్ సహకారంతో పార్కింగ్ షెడ్లు నిర్మించారు. అయితే ఎలాంటి సౌకర్యాలు లేని ప్రైవేటు కళాశాలలకు అటానమస్, న్యాక్ ఏ గ్రేడ్ ఇచ్చిన నేపథ్యంలో.. ప్రభుత్వ నిధులు ఏమాత్రం రాకున్నప్పటికీ పూర్తి సౌకర్యాలతో నాణ్యమైన విద్యనందిస్తున్న గిరిరాజ్ కళాశాలకు న్యాక్ బీ గ్రేడ్ మాత్రమే ఇవ్వడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ కళాశాలకు 'న్యాక్ ఏ ప్లస్' గ్రేడ్ ఇవ్వాలని విద్యాభిమానులు డిమాండ్ చేస్తున్నారు.

'న్యాక్ ఏ ప్లస్' కోసం కృషి చేస్తున్నాం



ఫిబ్రవరి మొదటి వారంలో కళాశాలకు న్యాక్ బృందం రానుంది. 2004 నుంచి అటానమస్ ఉంది. ప్రస్తుతం న్యాక్ బీ గ్రేడ్ ఉంది. న్యాక్ ఏ గ్రేడ్ కోసం గత మూడేళ్లుగా కృషి చేస్తున్నాం. ఈసారి 'న్యాక్ ఏ ప్లస్' గ్రేడ్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నాం. అందుకు అనుగుణంగా కళాశాలలో అన్ని సౌకర్యాలు, నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నాం. డాక్టర్ పి రామ్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్

ఎండబెట్టిన పసుపు తీసుకురావాలి



పసుపును పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి

సుభాష్‌నగర్: ఎండబెట్టిన పసుపును మాత్రమే మార్కెట్‌యార్డుకు తీసుకు రావాలని నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి రైతులకు సూచించారు. అధికారులతో కలిసి నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో పసుపు కల్లాలను గంగారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండిన పసుపును తీసుకొస్తే రూ.10వేలకుపైగా ధర దక్కేలా మార్కెట్ కమిటీ కృషి చేస్తుందన్నారు. మార్కెట్‌యార్డుకు ఇప్పుడిప్పుడే పసుపు పంటను రైతులు తీసుకొస్తున్నారని, పచ్చిగా ఉన్న పసుపునకు లాట్ ఐడీలు ఇవ్వకుండా తిరిగి పంపిస్తున్నామని తెలిపారు. 12 శాతం తేమ ఉన్న పసుపు తీసుకొచ్చి రైతులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు. ఆయనవెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశ్, సూపరింటెండెంట్ లాబన్, సిబ్బంది శంకర్ దాస్, గురుదాస్‌రెడ్డి, తదితరులున్నారు.

చిన్నపిల్లల్లో క్షయవ్యాప్తిని అరికట్టాలి



నిజామాబాద్‌నాగారం: చిన్న పిల్లల్లో క్షయ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి రాజశ్రీ అన్నారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గ్లోబల్ ఫండ్, సాతి, టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పిల్లల వైద్యులు, స్టాఫ్ నర్సులకు, ఎన్టీఈపీ సిబ్బందికి మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని జీజీహెచ్‌లో నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ప్రతి ఆస్పత్రిలో క్షయ నివారణకు సంబంధించిన పోస్టర్లు, స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రమేశ్, అంజన, రాజు, సూపరింటెండెంట్ లు శ్రీనివాస్, శ్రీనివాస్ ప్రసాద్, జిల్లా క్షయ నిర్మూలన అధికారి దేవీనాగేశ్వరి, రీసోర్స్ పర్సన్, పిల్లల వైద్యులు శ్రీశైలం, హరిప్రియ, ఐఎంఏ అధ్యక్షుడు అజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం బియ్యం సరఫరాపై ఆగ్రహం

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్న కలెక్టర్ హనుమంతు
- నూత్‌పల్లి బీసీ గురుకులం, తొండాకూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఆకస్మిక తనిఖీ



నూత్‌పల్లి బీసీ గురుకులంలో అన్నాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

డొంకేశ్వర్(ఆర్మూర్): పాఠశాలలకు నాసిరకం బియ్యం సరఫరా చేయడంపై జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అసహనం వ్యక్తం చేశారు. డొంకేశ్వర్ మండలంలో మంగళవారం పర్యటించిన కలెక్టర్ నూత్‌పల్లి బీసీ బాలుర గురుకులం, తొండాకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీసీ గురుకులంలో బియ్యం నాసిరకంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు ఫోన్ చేశారు. నాణ్యత లేని బియ్యం కారణంగా అన్నం సరిగా ఉడకడం లేదని, బియ్యం బస్తాలు ఎక్కడి నుంచి వచ్చాయో తెలుసుకునేందుకు కనీసం ట్యాగ్‌లు కూడా లేవన్నారు. వెంటనే నాణ్యమైన సన్నబియ్యం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్టోర్ రూమ్‌లో నిలువ ఉంచిన ఆహార పదార్థాలు, కూరగాయలు, ఇతర సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. తరగతి గదులను సందర్శించి విద్యా బోధన తీరును గమనించారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున సిలబస్ పూర్తి చేసి పునఃశ్చరణ తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అనంతరం తొండాకూర్ జెడ్పీహెచ్‌ఎస్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో అసంపూర్తిగా మిగిలి ఉన్న పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ ఆనంద్, ఎంపీవో లక్ష్మీప్రసాద్, ఆర్‌ఐలు కిరణ్, అశోక్ ఉన్నారు.

అనర్హులకు ఆత్మీయ భరోసా!

- గ్రామసభల్లో వెల్లడైన పేర్లు
- మరోసారి పరిశీలిస్తామంటున్న అధికారులు
- జిల్లాలో ఇప్పటికే 3వేల మంది పేర్లు బహిర్గతం



మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలంలోని వడ్యాట్‌లో ఓ విద్యార్థికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం మంజూరైనట్లు గ్రామసభ ద్వారా వెల్లడైంది. అలాగే ఆర్థికంగా స్థిరపడిన కుటుంబంలోని యువకుడికి ఆత్మీయ భరోసా మంజూరైనట్లు జాబితాలో అధికారులు వెల్లడించడంతో తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని వ్యవసాయ కూలీలకు సాయం అందించాల్సి ఉండగా ఆర్థికంగా ఉన్నవారి పేర్లు జాబితాల్లో కనిపించడం గందరగోళానికి దారి తీసింది. ఇది ఒక్క వడ్యాట్‌లోనే చోటు చేసుకున్న ఘటన కాదు. జిల్లాలో అనేక చోట్ల ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల జాబితాలో అనర్హుల పేర్లు నమోదు కావడంతో పథకం పక్కదారి పడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

■ భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఆర్థికంగా చేయూతను అందించేందుకు నిర్దేశించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అనర్హులకు అందిస్తే ప్రభుత్వ ఉద్దేశం నీరుగారుతుందనే వాదన వినిపిస్తోంది. జిల్లాలో 42 వేల మందిని ఆత్మీయ భరోసా పథకం కింద ఎంపిక చేయగా నాలుగు రోజుల పాటు నిర్వహించిన గ్రామ సభల్లో 3 వేల మంది అనర్హులు ఉన్నట్లు తేలింది. జిల్లాలో 530 (కొత్తవి కాకుండా) గ్రామ పంచాయతీల పరిధిలో 2023లో చేపట్టిన ఉపాధి పనుల్లో కనీసం 20 రోజులపాటు హాజరైన కుటుంబాలను పరిగణనలోకి తీసుకుని ఆత్మీయ భరోసా లబ్ధిదారుల జాబితాను రూపొందించారు. అప్పట్లో 85 వేల కుటుంబాలు ఉపాధి పనుల్లో పాల్గొన్నా యి. ఉపాధి కూలీల కుటుంబాల జాబ్‌కార్డులను ధరణి వెబ్‌పోర్టల్‌తో అనుసంధానం చేసి 42వేల మందికి భూమి లేదని గుర్తించారు. ధరణి వెబ్‌పోర్టల్, జాబ్‌కార్డుల అనుసంధానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో భూమి ఉన్నవారికి కూడా ఆత్మీయ భరోసా మంజూరైనట్లు జాబితాల్లో బహిర్గతమైంది.

అర్హులకే అందిస్తాం

అర్హులకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సాయం అందుతుంది. ఎంపీడీవోల ద్వారా మరోసారి అనర్హులను ఏరివేసే ప్రక్రియ నిర్వహిస్తాం. గ్రామ సభల్లో జాబితాలను బహిర్గతం చేయడం ద్వారా అర్హులు, అనర్హులను గుర్తిస్తున్నాం. ఆత్మీయ భరోసా పథకాన్ని వంద శాతం అర్హులకే వర్తింపజేస్తాం.

– సాయాగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి

కోతకు వచ్చిన ఎర్రజొన్న

- మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న పనులు
- ధర పైనే అన్నదాతల్లో ఆందోళన



బాల్కొండ: జిల్లాలో సాగైన ఎర్రజొన్న పంట కోతకు వచ్చింది. మరో వారం రోజుల్లో ఎర్ర జొన్న పంట కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. జిల్లాలో 50 వేల ఎకరాల విస్తీర్ణానికి పైగా భూమిలో ఎర్ర జొన్న సాగు చేస్తారు. ప్రధానంగా ఆర్మూర్ డివిజన్‌లో అధికంగా జొన్న సాగు చేస్తారు. ఎర్రజొన్న పంట వాణిజ్య పంటకావడంతో విత్తనాలు సీడ్ వ్యాపారులే సరఫరా చేసి వారే కొనుగోలు చేస్తారు. కానీ ప్రస్తుత సంవత్సరం జొన్న పంట కొనుగోలుకు బై బ్యాక్ ఒప్పందం లేదు. దీంతో రైతులు ఎవరికైనా పంట దిగుబడిని విక్రయించుకునే అవకాశం ఉంది. గతంలో సీడ్ సరఫరా చేసే వ్యాపారులకే పంట దిగుబడి విక్రయించాలనే ఒప్పందం ఉండేది. కానీ వ్యాపారులు సిండికేట్‌గా మారుతున్నారని రైతులు ఒప్పందం లేకుండానే జొన్న పంటను సాగు చేస్తున్నారు. విత్తనాల సరఫరా సమయంలో సూచన ప్రాయంగా క్వింటాల్‌కు రూ.3,800 ధర ఉంటుందని తెలిపినప్పటికీ పంట పూర్తిగా చేతికొచ్చిన సమయంలో ధర ఎంత ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎర్రజొన్న విత్తనాలను నవంబర్ మాసంలో విత్తుతారు. జనవరి చివరి వరకు పంట చేతికి వస్తుంది. 100 నుంచి 120 రోజుల్లో పంట చేతికందుతుందని రైతులు అంటున్నారు. ప్రతి సంవత్సరం ఎర్రజొన్న సాగు చేసిన తమకు ఏడుపే మిగులుతోందని, ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటను విక్రయించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సజ్జ ధర ప్రభావం ఉంటుందా!

సజ్జ పంట కూడా వాణిజ్య పంట కావడంతో సీడ్ వ్యాపారులే విత్తనాలను సరఫరా చేసి పంట దిగుబడిని కొనుగోలు చేస్తారు. క్వింటాల్‌కు రూ.6,300 నుంచి రూ.6,600 వరకు వ్యాపారులు ఇది వరకే బై బ్యాక్ ఒప్పందం చేసుకున్నారు. గతేడాది కన్నా క్వింటాల్‌కు సుమారు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు తగ్గించారు. ప్రస్తుతం ఆ ప్రభావం ఎర్రజొన్న పంటపై కూడా పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎర్రజొన్న పంట క్వింటాల్‌కు రూ.5వేల ధర పలికింది. కానీ ప్రస్తుత సంవత్సరం ముందుగానే రూ.వెయ్యి తగ్గించి సూచన ప్రాయంగా ధర చెప్పారు. సజ్జ ధర ప్రభావం జొన్నలపై కూడా పడితే ధర దక్కదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎర్రజొన్న వ్యాపారులు సిండికేట్ కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

సిండికేట్ భయం ఉంది



జొన్న పంట కొనుగోలులో వ్యాపారులు సిండికేట్ అవుతారనే భయం వెంటాడుతోంది. గతంలో అనేక సార్లు ఇదే జరిగి రైతులందరం తీవ్రంగా నష్టపోయాం. వ్యాపారులు సిండికేట్ కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. జొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. – బుల్లెట్ రాంరెడ్డి, రైతు

క్లుప్తంగా

జాతీయ క్రీడలకు టెక్నికల్ ఆఫీషియల్‌గా విజయ్‌కాంత్‌రావు



నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి సైక్లింగ్ క్రీడా పోటీలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూలోకం విజయ్‌కాంత్‌రావును టెక్నికల్ ఆఫీషియల్‌గా నియమిస్తూ సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ సెక్రెటరీ జనరల్ మనింధర్ పాల్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విజయ్‌కాంత్‌రావు రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్, నిజామాబాద్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లో ఈనెల 28నుంచి వచ్చే నెల 14వరకు జరగనున్న 38వ జాతీయ క్రీడల్లో ఆయన సైక్లింగ్ క్రీడాంశంలో టీవోగా వ్యవహరించనున్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

నిజామాబాద్ రూరల్: నగరశివారులోని సారంగాపూర్‌లోగల మెగా పబ్లిక్ హైస్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థిని ప్రిన్సిపల్ చితకబాదిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాలు ఇలా.. ఒకటో తరగతి విద్యార్థి సోమవారం స్కూల్‌లో ఎవరికీ చెప్పకుండా భోజనం కోసం ఇంటికి వచ్చాడు. అనంతరం తనను ప్రిన్సిపాల్ అనవసరంగా చితకబాధినట్లు తల్లిదండ్రులకు తెలిపాడు. గాయాలను సైతం వారికి చూపించాడు. మళ్లీ స్కూల్‌కు పంపితే దండిస్తారనే భయంతో స్కూల్‌కు వెళ్లడానికి నిరాకరించాడు. సదరు విద్యార్థి స్కూల్‌లో కనిపించకపోవడంతో యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్‌చేసి ఆరాతీశారు. విద్యార్థి తల్లిదండ్రులు జరిగిన విషయాన్ని యాజమాన్యానికి వివరించి, అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్, డీఈవోలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



నందిపేట్ (ఆర్మూర్): ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు స్థానికంగా ఉండాలని వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య పరీక్షలు, రక్త పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఆనంద్, ఎంపీవో లక్ష్మీప్రసాద్ తదితరులు ఉన్నారు.

రాయకూర్‌లో తాగునీటి కోసం ఆందోళన





గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు.. తాళం వేయడంతో కార్యాలయంలోనే ఉండిపోయిన కార్యదర్శి శ్రీనివాస్

- కార్యదర్శిని నిర్బంధించి జీపీకి తాళం వేసిన గ్రామస్తులు

రుద్రూర్: మండలంలోని రాయకూర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని మంగళవారం గ్రామస్తులు ఆందోళన చేశారు. ఖాళీ బిందెలు, బకెట్లతో జీపీ కార్యాలయానికి తరలివచ్చారు. కొన్ని నెలలుగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతుంటే జీపీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం జీపీ కార్యదర్శిని నిర్బంధించి కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు.

మాజీ ఎంపీటీసీ సాయిలు మాట్లాడుతూ.. పది రోజులుగా నీటి కోసం గ్రామంలో ఘర్షణలు జరుగుతున్నాయని, సమస్యను జీపీలో విన్నవిస్తే పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను పరిష్కరించకుంటే మండల కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

చదువుకున్న బడిని మరువని ఎన్‌ఆర్‌ఐ

- సోదరుడి జ్ఞాపకార్థం పాఠశాలలో సౌకర్యాల కల్పనకు చేయూత
- రూ.లక్షలు వెచ్చించి, దాతృత్వం చాటిన ప్రవాస భారతీయుడు సుంకం లక్ష్మణ్



పాలెం ప్రాథమికోన్నత పాఠశాలకు ఎన్‌ఆర్‌ఐ లక్ష్మణ్ అందించిన సామగ్రి

మోర్తాడ్: తన సోదరుడితో కలిసి చిన్నప్పుడు చదువుకున్న పాఠశాలను ఇప్పటికీ మరువని ఓ ఎన్‌ఆర్‌ఐ, బడిలో సౌకర్యాల కల్పనకు తనవంతు చేయూతనందిస్తున్నాడు. మోర్తాడ్ మండలం పాలెంకు చెందిన లక్ష్మణ్ సుంకం తన సోదరుడు రాజేశ్వర్‌తో కలిసి చిన్నతనంలో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించాడు. ప్రస్తుతం ఉన్నత చదువులు చదివి, అమెరికాలో స్థిరపడ్డాడు. అయినా ఆనాటి పాఠశాలను తను ఇప్పటికీ మరువలేదు. అతడి సోదరుడు అనారోగ్యంతో మృతిచెందగా, అతడి జ్ఞాపకార్థం పాఠశాలకు చేయూతను అందించాలనుకున్నాడు. ఈక్రమంలో ఆయన ఇప్పటి వరకు రూ.5లక్షల వరకు వివిధ దశల్లో ఖర్చు చేసి పాఠశాల విద్యార్థులకు వివిధ సౌకర్యాలను కల్పించారు. తాజాగా ఒకటి, రెండో తరగతి విద్యార్థుల కోసం రూ.40వేలతో బల్లలు, కుర్చీలను కొనుగోలు చేశారు. ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను సైతం లక్ష్మణ్ అందిస్తుండటం విశేషం. ప్రయివేటు పాఠశాలలతో పోటీ తీవ్రం కావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది. విద్యార్థుల సంఖ్య పెరగాలన్నా వారికి మెరుగైన సౌకర్యాలు అవసరం. దీంతో అతడు ప్రయివేటు పాఠశాలల మాదిరిగా అన్ని వసతులు సమకూర్చుతున్నారు.

ఎంతైనా ఖర్చు చేస్తాం...



విద్యాభివృద్ధి కోసం ఎంతైనా ఖర్చు చేస్తాం. మేము చదువుకున్న సమయంలో వసతులు లేవు. అప్పటి పరిస్థితి వేరు. ఇప్పటి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల కోసం ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాం. – సుంకం లక్ష్మణ్, అమెరికా

సహకారం మరువలేనిది..

పాఠశాలకు ప్రవాస భారతీయుడు లక్ష్మణ్ సుంకం అందిస్తున్న సహకారం మరువలేనిది. ఆయన ఆర్థిక సాయం అందించడం వల్ల పాఠశాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండాపోయింది. ప్రభుత్వ పాఠశాలలకు ఇలాంటి దాతల సహకారం ఎంతో అవసరం.

– ప్రమీలారాణి, హెచ్‌ఎం, పాలెం ప్రాథమికోన్నత పాఠశాల

రెండు గ్రామాల్లో పోలీసు బందోబస్తు



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి, మల్లుపల్లి గ్రామాల్లో పోలీసులు మంగళవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మల్లుపల్లి గ్రామానికి చెందిన మాలె నారాయణ ఇటీవల సంగారెడ్డి జిల్లాలో హత్యకు గురైన విషయం తెలిసిందే. నారాయణ హత్య కేసులో రామేశ్వర్‌పల్లికి చెందిన రాకేశ్ నిందితుడిగా ఉన్నాడు. దీంతో మల్లుపల్లి గ్రామస్తులు నారాయణ మృతదేహాన్ని రామేశ్వర్‌పల్లికి తీసుకువచ్చేందుకు యత్నిస్తున్నారని పోలీసులకు సమాచారం అందడంతో బందోబస్తు ఏర్పాటు చేశారు. రామేశ్వర్‌పల్లి పెద్ద మనుషులు నారాయణ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో మల్లుపల్లి గ్రామస్తులు శాంతించారు. అనంతరం గ్రామంలో నారాయణ అంత్యక్రియలను పూర్తి చేశారు.

యువత సేవలు అభినందనీయం



ప్రశంసాపత్రాలు అందుకున్న యువకులతో ఏసీపీ నారాయణ

నిజామాబాద్‌నాగారం: రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా యువకులు స్వచ్ఛందంగా ట్రాఫిక్ పోలీసుల విధులను అధ్యయనం చేయడం కోసం ముందుకు రావడం, విధుల్లో పాలుపంచుకోవడం అభినందనీయమని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ అన్నారు. మేరా యువభారత్ నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేయబడిన 25మంది యువకులు రెండు రోజుల పాటు నగరంలోని పలు జంక్షన్ల వద్ద విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌తోపాటు కలిసి ట్రాఫిక్ నిర్వహణలో శిక్షణ తీసుకున్నారు. ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రెండు రోజులపాటు ట్రాఫిక్ పోలీసులతో కలిసి వారికి విధుల్లో సహకరించటం నిజంగా అభినందనీయమని ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువకుల్లో ఒక నిర్మాణాత్మకమైన మార్పు ఏర్పడుతుందని తద్వారా బాధ్యతాయుతమైన సమాజం నిర్మాణం అవుతుందన్నారు. జిల్లా యువజన అధికారిని శైలిబెల్లాల్ మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ ప్రజల కోసం పని చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు నిజంగా అభినందనీయులన్నారు. అనంతరం యువకులకు ప్రశంసాపత్రాలు, డైరీ, పెన్నును అందించారు. ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డయల్ 100ను దుర్వినియోగం చేసిన వ్యక్తికి జైలు

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన పులి సచిన్ అనే వ్యక్తి ఇటీవల డయల్ 100కు పలుమార్లు ఫోన్‌చేసి పోలీసుల విధులను దుర్వినియోగ పరిచాడు. దీంతో పోలీసులు అతడిని పట్టుకొని, ఆర్మూర్ కోర్టులో హాజరు పరుచగా జడ్జి అతడికి 4రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై సంజీవ్ మంగళవారం తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఉపయోగపడే డయల్ 100ను అవసరానికి మాత్రమే ఉపయోగించాలని ఎస్సై తెలిపారు.

జక్రాన్‌పల్లి మండలంలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని నూర్‌సింగ్ తండాకు చెందిన భూక్య సంతోష్‌కు న్యూసెన్స్ కేసులో ఆర్మూర్ కోర్టు రెండు రోజులు జైలు శిక్ష విధించింది. నూర్‌సింగ్ తండాకు చెందిన భూక్య సంతోష్ ఈనెల 27న మద్యం తాగి డయల్ 100, 108కు కాల్ చేసి పోలీసు, 108 సేవలను దుర్వినియోగం చేశారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించగా ఆర్మూర్ కోర్టు రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

సంప్రదాయ ఆభరణాల తయారీతో ఆర్థికంగా ఎదగాలి



గిరిజన మహిళలతో మాట్లాడుతున్న అధికారులు



బంజారా సంప్రదాయ ఆభరణాలను పరిశీలిస్తున్న ఏపీడీ రవీందర్

డిచ్‌పల్లి(నిజామాబాద్ రూరల్): సంప్రదాయ ఆభరణాల తయారీతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఏపీడీ రవీందర్ సూచించారు. మండలంలోని బీబీపూర్ తండా పరిధిలోని అవుసుల తండాను మంగళవారం ఆయన సందర్శించారు. తండాలో మహిళా సంఘం సభ్యులు తయారు చేస్తున్న బంజారా (లంబాడి) సంప్రదాయ ఆభరణాలను పరిశీలించారు. ఆభరణాల తయారీ, ముడిసరుకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. బంజారా సంప్రదాయ ఆభరణాల తయారీ నైపుణ్యంలో శిక్షణ, తయారు చేసిన ఆభరణాలకు మార్కెటింగ్ సౌకర్యాలను కల్పిస్తామని ఆయన తెలిపారు. త్వరలో జరిగే అంతర్జాతీయ మహిళా సంఘాల సభ్యుల ఉత్పత్తుల తయారీ మేళాకు అవుసుల తండా మహిళలు పాల్గొనేలా అవగాహన కల్పించారు. డీపీఎం సాయిలు, ఏపీఎం గంగాధర్, సీసీలు స్వరూప, జ్యోతి, సురేష్, ఉపేందర్, అనిల్, దివ్య, రజిత, సారిక ఉన్నారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్న బైక్‌లు

- ముగ్గురికి గాయాలు



రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్

రెంజల్(బోధన్): రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను రెండు బైక్‌లు వేర్వేరుగా ఢీకొనగా ముగ్గురు గాయాపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా.. రెంజల్ మండలం దండిగుట్ట-కళ్యాపూర్ గ్రామాల మధ్య ఉన్న నవీపేట్-కందకుర్తి ప్రధాన రోడ్డుపై ఓ టిప్పర్ ఆగి ఉంది. నిజామాబాద్ మండలం కాలూర్‌కు చెందిన రామకృష్ణ అతడి స్నేహితుడు వీరన్నగుట్ట నుంచి కాలూర్‌కు బైక్‌పై బయలుదేరాడు. ఈక్రమంలో నవీపేట్-కందకుర్తి ప్రధాన రోడ్డుపై ఆగిఉన్న టిప్పర్‌ను గమనించకపోవడంతో ఢీకొన్నారు. ఈ ఘటనలో వారు గాయపడగా స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. మరికొద్దిసేపటికే దండిగుట్టకు చెందిన సురేష్ బైక్‌పై కళ్యాపూర్‌లో చికెన్ తీసుకుని ఇంటికి వస్తుండగా అదే టిప్పర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని 108 అంబులెన్స్‌లో నిజామాబాద్‌కు తరలించారు. సురేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై రెంజల్ పోలీసులను సంప్రదించగా రోడ్డు ప్రమాదం జరిగింది వాస్తవమని, తమకు బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని పోలీసులు వివరించారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రామ్ మంగళవారం తెలిపారు. సిరికొండలోని బంక మౌనిక(28) అనే వివాహితకు మానసిక స్థితి సరిగాలేదు. ఈక్రమంలో ఆమె తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త దిలీప్‌తో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని మాధవ నగర్ ప్రాంతంలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంద పోచయ్య(50) మంగళవారం కామారెడ్డిలో దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కి నిజామాబాద్ వైపుగా ప్రయాణించాడు. మాధవనగర్ క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో అతడు ప్రమాదవశాత్తు రైలు నుంచి కాలు జారికింద పడ్డాడు. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

నవీపేట: ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. వివరాలు ఇలా.. నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పాల్ద గ్రామానికి చెందిన ఉల్లెంగ శేఖర్ (27) అప్పుల బాధ భరించలేక ఈనెల 24న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మంగళవారం పరిస్థితి విషమించడంతో చికిత్సపొందుతూ అతడు మృతిచెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని బేగంపూర్ గ్రామ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారిపై అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేసి, టిప్పర్‌ను తహసీల్దార్ దశరథ్‌కు అప్పగించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై మహేందర్ హెచ్చరించారు.

ఇసుక డంపు స్వాధీనం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి దగ్గరలో ఉన్న ఇసుక డంపును సోమవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. సంబంధిత వ్యక్తులు సరైన ఆధారాలు చూపక పోవడంతో అక్రమంగా ఇసుక వ్యాపారం సాగుతుందని రెవెన్యూ అధికారుల విచారణలో వెల్లడైంది. దీంతో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి ఇసుక డంపును స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకు గిర్దావార్ సాయిలు తరలించారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను త్వరలో వేలం వేస్తామని అధికారులు తెలపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

డబ్బుల కోసం తల్లిని హతమార్చిన కుమారుడు



మంగ్లీబాయి (ఫైల్)

రుద్రూర్: నవమాసాలు కని పెంచిన తల్లిని కనికరం లేకుండా నగలు, డబ్బుల కోసం కొడుకు హతమార్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారంనకు చెందిన నేనావత్ మంగ్లీ బాయి (72)కి నలుగురు కుమారుల్లో ఇద్దరు గతంలోనే మరణించారు. రెండవ కుమారుడు రాములు మద్యానికి బానిసై, తల్లి వద్ద ఉన్న డబ్బులు ఇవ్వమని తరచు గొడవపడేవాడు. రాములు ప్రవర్తనతో విసుగు చెందిన భార్య గతంలోనే పుట్టింటికి వెళ్లిపోయింది. మూడు రోజుల క్రితం మద్యం మత్తులో ఉన్న రాములు డబ్బులు కావాలని తల్లితో ఘర్షణ పడ్డాడు. అప్పటి నుంచి మంగ్లీబాయి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. రాములుపై అనుమానంతో కుటుంబ సభ్యులు అతడిని నిలదీయగా చెరువు కుంట వద్ద హత్య చేసినట్టు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం గ్రామానికి వచ్చి కుంటలో నుంచి మంగ్లీబాయి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. తల్లి వద్ద ఉన్న డబ్బులు, వెండి ఆభరణాల కోసమే రాములు హత్య చేశాడని మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సందీప్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ పేలి చెరుకు తోట దగ్ధం



దగ్ధమైన చెరుకుతోట వద్ద రైతు మల్లేశ్

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన రైతు నేతుల మల్లేశానికి చెందిన చెరుకు తోట మంగళవారం ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ పేలి మంటలు రావడంతో దగ్ధమైంది. మల్లేశ్ వ్యవసాయ బావి వద్ద విద్యుత్ సిబ్బంది కరెంట్ సరఫరా నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపట్టారు. పనుల అనంతరం కరెంట్ సరఫరాను పునరుద్ధరించగా ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. మంటలు వ్యాపించి చెరుకు తోట, డ్రిప్ పైపులకు అంటుకున్నాయి. ఫైరింజన్‌కు సమాచారం అందించగా, వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. పంట దగ్ధం కావడంతో దాదాపు రూ.3లక్షల వరకు నష్టం జరిగినట్లు రైతు మల్లేశం తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

కోతుల దాడిలో బాలుడికి గాయాలు



గాయపడిన బాలుడు

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండల కేంద్రాలతో పాటు చుట్టుపక్క గ్రామాల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. మహమ్మద్ నగర్, బూర్గుల్ గ్రామాల్లోని ఇద్దరు చిన్నారులపై మంగళవారం కోతులు దాడి చేసి గాయపర్చాయి. కోతుల దాడిలో గాయపడిన చిన్నారులను వారి తల్లిదండ్రులు ఆస్పత్రులకు తరలించి చికిత్సలు చేయించారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కోతులు గుంపులు, గుంపులుగా ఉంటున్నాయి. అంతేకాకుండా మధ్యాహ్న భోజన సమయంలో కోతులు తమ ప్లేట్లను ఎత్తుకెళ్లుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి గ్రామాల్లో కోతుల బెడదను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లింగారెడ్డిపేటలో ఒకరి అదృశ్యం



ఎల్లారెడ్డి: మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ అదృశ్యమైనట్లు ఎస్సై మహేష్ మంగళవారం తెలిపారు. మటన్ షాపులో పనిచేసే షేక్ అహ్మద్(47)కు గత కొన్నేళ్లుగా మానసిక స్థితి సరిగాలేదు. ఈనెల 24న అతడు తన ఇంటినుంచి బయటకు వెళ్లి ఇప్పటికీ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య బేగరి పొలవ్వ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

పేకాట ఆడుతున్న పలువురి అరెస్టు

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎస్సీ, బీసీ కాలనీలోగల ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి పక్కా సమాచారంతో దాడి చేయగా పేకాడుతున్న వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న రూ.2,35,470 నగదును, 7మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

పెద్దకొడప్‌గల్ మండలంలో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కస్లాబాద్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై మహేందర్ సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఎనమిది మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద ఉన్న 24వేల380రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

టీచర్‌కు షోకాజ్ నోటీసు

నిజామాబాద్ అర్బన్: నగరంలోని పూలాంగ్ ప్రాథమిక పాఠశాల టీచర్ నాగరాజుకు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. డీఈవో మంగళవారం పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో నాగరాజు విధుల్లో లేకపోవడంతో నోటీసు ఇచ్చారు. ఇదే పాఠశాలలో మరో ఇద్దరు ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ చేపడతామన్నారు.

జానకంపేటలో వ్యక్తి దారుణ హత్య



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట గ్రామంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. జానకంపేట గ్రామంలో నివసిస్తున్న బత్తుల నరసయ్య (50) రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండడాన్ని స్థానికులు గమనించి ఎడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై ఇలియాస్, తన బృందంతో వెంటనే ఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. రక్తపు మడుగులో ఉన్న ఈలపీటను స్వాధీనం చేసుకున్నారు. తలకు బలమైన గాయం చేతనే వ్యక్తి మృతిచెంది ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడికి కొడుకు, కూతురు ఉండగా, కూతురికి ఇటీవల వివాహం జరిగింది. ఇంట్లో తన కొడుకుతో అతడు నివాసం ఉంటున్నాడు. దీంతో కొడుకు బత్తుల శేఖర్ నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.